క్లుప్తంగా

నేడు మండల సమావేశం

సోంపేట: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అధ్యక్షతన ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ


పరామర్శలో చైర్‌పర్సన్ విజయ తదితరులు

కవిటి: కమలాయిపుట్టుగ గ్రామపెద్ద బచ్చు ఢిల్లేశ్వరరావు మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఢిల్లేశ్వరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు, బచ్చు ధనంజయ్, ఇసురు మోహనరావు, రాంపత్ని చంద్రశేఖరం ఉన్నారు.

రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షకు అర్హత


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వజ్రపుకొత్తూరు: రాష్ట్రస్థాయి ప్రతిభ పరీక్షకు గోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్హత సాధించారని హెచ్‌ఎం కె.హరిబాబు తెలిపారు. ఏడో తరగతి విద్యార్థులు పట్టపగలు ప్రవీణ్, డొక్కరి ప్రత్యూష, సాన ప్రియ మెయిన్స్‌కు అర్హత సాధించారన్నారు. విద్యార్థులతోపాటు గైడ్ టీచర్ ఉమారావును సిబ్బందితో కలిసి సోమవారం అభినందించారు. ఎడ్యుకేషనల్ ఎఫిషియన్సీ మెరిట్ టెస్ట్‌లో ప్రిలిమ్స్ ఉత్తీర్ణులై రాష్ట్రస్థాయి మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారన్నారు.

ఆదిత్యలో పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో కళాశాల ప్రతినిధులు

టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం పుస్తకావిష్కరణ చేశారు. కళాశాలకు చెందిన సహాయ ప్రొఫెసర్లు గంటి విజయ్‌కుమార్, మొదలవలస దివ్య తదితరులు రచించిన డేటా వేర్ హౌసింగ్ అండ్ డేటా మైనింగ్ పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. సీఎస్ఈ, ఐటీ, సీఎస్ఎం, ఈసీఈ విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ డి.శ్రీరాములు, సీఎస్ఈ హెచ్‌వోడీ వై.రమేష్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి


పౌష్టికాహారం ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. అంగన్‌వాడీ ఈసీసీఈ దినోత్సవం సందర్భంగా కొత్త శాసనాం అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల మార్కెట్‌ను సోమవారం ప్రారంభించారు. ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు అందించాలన్నారు. అనంతరం పౌష్టికాహారం ప్యాకెట్లను అందజేశారు. భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి కూరగాయ మార్కెట్‌ను ప్రారంభించారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త బర్రి నరసమ్మలు పాల్గొన్నారు.



తలుపులు ఉండాల్సిన చోట ఇటుకతో మరుగుదొడ్డిని కప్పేసిన దృశ్యం


టిక్కెట్ కౌంటర్ ఎదురుగా పనిచేయని మరుగుదొడ్లు


పనిచేయని లిఫ్ట్

మరమ్మతులు సరే.. తాత్కాలిక సేవలేవీ?



- పలాస రైల్వేస్టేషన్‌లో కానరాని మౌలిక సదుపాయాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మరుగుదొడ్లులేక మహిళల అవస్థలు

కాశీబుగ్గ:

పలాస రైల్వే స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కానరావడం లేదు. ఈ స్టేషన్ పేరుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఉన్నప్పటికీ అధికారికపరమైన సేవలన్నీ ఒడిశా రాష్ట్రం ఖుర్దా రైల్వే డివిజన్ పరిధిలో ఉండిపోవడంతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయింది. స్టేషన్ ఆధునికీకరణ పనులు ఏడాదిగా జరుగుతున్నా ఇప్పటికీ కొలిక్కిరాలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకు మరమ్మతుల పేరుతో కాలయాపన చేస్తుండడంతో ఇక్కడి నుంచి ప్రయాణించేవారికి తాత్కాలిక సేవలు సైతం అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


2, 3 ఫ్లాట్‌ఫాంలో జరుగుతున్న ఆధునికీకరణ పనులు

మౌలిక సదుపాయాలు దూరం

పలాస రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనులు జరుగుతుండడం సంతోషమే. అయితే అక్కడ అందించాల్సిన సేవలకు మంగళం పలకడంతో ఇక్కడ నుంచి రాకపోకలు జరిపే వేలమంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రేడ్-ఏ స్టేషన్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ఉన్నతాధికారులు దృష్టిసారించడం లేదు. జిల్లాలో అతిపెద్ద స్టేషన్లలో పలాస రైల్వేస్టేషన్ ఒకటి. అయితే ఇక్కడ మరుగుదొడ్లు లేవని తెలుసుకుని అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. మరమ్మతుల పేరుతో రెండు, మూడో నంబర్ ప్లాట్‌ఫాంలపై ఉండే రెండు, టిక్కెట్ కౌంటర్ వద్ద ఉన్న రెండు మరుగుదొడ్లను మూసివేశారు. అలాగే ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉన్న ఒకేఒక్క మరుగుదొడ్డికి పూర్తిస్థాయిలో రన్నింగ్ నీటి సరఫరా లేక అరకొర సేవలకే పరిమితమైంది. అక్కడికి చేరుకోవాలంటే రెండు ట్రాక్‌లు దిగి.. తిరిగి ఎక్కాల్సి రావడం ప్రమాదకరంగా మారింది. ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో అప్పటి వరకూ అందుతున్న సేవలను నిలిపి వేసిన రైల్వే అధికారులు తాత్కాలిక సేవలపై దృష్టిసారించలేదు. వాస్తవంగా మొబైల్, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఎందుకో వీటిపై ఆసక్తి చూపలేదు. ఆధునికీకరణ పనులు పూర్తయ్యేవరకైనా తాత్కాలికంగా మూడు ప్లాట్‌ఫారాలపై ఒక్కో మరుగుదొడ్డిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయలు కల్పించాలి



పలాస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాల్లేవు. మంచినీరు, మరుగుదొడ్లు లేవు. లిఫ్ట్ పనిచేయక చాలా మంది అవస్థలు ఎదుర్కొంటున్నారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు స్టేషన్‌లో పని తీరు గమనించాలి. ఆధునికీకరణ పనులు పూర్తయ్యేవరకూ తాత్కాలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

–బి.ధుర్యోధనరావు, చినంచల గ్రామం, పలాస మండలం

అపరిశుభ్ర వాతావరణంలో నీటి సరఫరా

రైల్వే ప్రయాణికులకు అందిస్తున్న నీటి కుళాయిలు కూడా ప్రస్తుతం అపరిశుభ్రమైన వాతావరణంలో ఉన్నాయి.దీంతో ఇక్కడ నీటిని వినియోగించడానికి ప్రయాణికులు వెనుకంజ వేస్తున్నారు. అలాగే అనారోగ్య, అత్యవసర వైద్య సేవలు పొందుతున్న ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్ సేవలు సైతం అందని పరిస్థితి నెలకుంది. ఇవి పనిచేయకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో దివ్యాంగులు, వృద్ధులు, రోగులు మెట్లమార్గంలో నడుచుకుని వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలు, సాధారణ ప్రయాణికులు వేచి ఉండే గదులు లేని పరిస్థితి ఇక్కడ ఉంది.


రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై మూసివేసిన మరుగుదొడ్డి

ఎస్‌ఎంసీ సమావేశం

కవిటి: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం కేటాయించి.. బ్యాంకు ఖాతాలో మిగులుగా ఉన్న నిధులు వినియోగించాలని ఎస్‌ఎంసీ సమావేశంలో తీర్మానం చేసినట్టు కవిటి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరరావు చెప్పారు. ఎస్‌ఎంసీ సమావేశం సోమవారం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. రూ.1.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రెండు గదులకు గ్రానైట్ వేసేందుకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

భవన నిర్మాణ పనులు పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: కొఠారి పంచాయతీ పూర్ణాటకం గ్రామంలోని శ్మశానవాటికలో నిర్మిస్తున్న సామాజిక భవన పనులను వైఎస్సార్‌సీపీ నాయకురాలు, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి సోమవారం పరిశీలించారు. పంచాయతీ అభివృద్ధే తమ ధ్యేయమని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


మాట్లాడుతున్న ఎస్సై లవరాజు

సోంపేట: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై లవరాజు అన్నారు. సోంపేట పట్టణంలోని కుమార్ జూనియర్ కళాశాలలో రోడ్డు నిబంధనలపై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. పోలీసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కోత రేపు

కాశీబుగ్గ: చినబాడం 11 కేవీ ఫీడర్ పరిధిలో బుధవారం మరమ్మతు పనులు చేపట్టనున్నారు. దీంతో ఉదయం పది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యజ్ఞేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెంటిబద్ర, జయ రామ చంద్రపురం, పద్మనాభపురం, పద్మనాభ పురం కాలనీ, ఓల్డ్ ఎన్‌హెచ్-5రోడ్డు, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వే గేట్‌డౌన్, పెసరపాడు, చినబాడాం, అంతరకుడ్డ, రాజపురం, పరిసర ప్రాంతాలకు సరఫరాను నిలిపి వేస్తామని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అధికార పార్టీ అండతో ఆక్రమణలు!


కోర్టు ఆర్డర్ కాపీలను చూపిస్తున్న ప్రేమకుమార్

ఇచ్ఛాపురం: పలాస మండలం రామకృష్ణాపురం గ్రామరెవెన్యూ సర్వేనంబర్ 143లో ఉన్న పది ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన అన్నాబత్తుల వెంకట్రావు, సోమేశ్వరరావులు అధికార టీడీపీ నాయకుల అండతో ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి చెందిన నర్తు ప్రేమ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమ్మ నర్తు పార్వతి, అమ్మమ్మ జుత్తు లక్ష్మమ్మలు ఉమ్మడిగా పది ఎకరాల భూమిని 1966 సంవత్సరంలో కొనుగోలు చేశారన్నారు. అందులో ఐదు ఎకరాలు అమ్మమ్మ మరణాంతరం నాన్న శ్రీరాములకు సంక్రమించిందన్నారు. తండ్రి మరణాంతరం మొత్తం పది ఎకరాల భూమిపై పూర్తి హక్కులు అమ్మకు సంక్రమించినట్టు వివరించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో భూమికి హద్దులను అనుసరించి పెన్సింగ్ వేయించి 143/1 ఏ3 సర్వేనంబర్ అందరికీ తెలియజేసేలా అమ్మ పేరుతో బోర్డులను ఏర్పాటు చేయించినట్టు పేర్కొన్నారు. ఈ క్రమంలో 2021లో అన్నాబత్తుల వెంకటరావు, సోమేశ్వరరావు తప్పుడు పత్రాలను సృష్టించి సోంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో తమపై తప్పుడు కేసు వేయడంతో న్యాయం కోసం కోర్టు ద్వారా పోరాటం చేస్తున్నట్టు పేర్కొన్నారు. కేసు నడుస్తుండడంతో అప్పటికీ స్థలం ఎలా ఉందో అదేవిధంగా ఉంచమని కోర్టు ఆర్డర్‌ను జారీచేసిందన్నారు. 2023లో తమ స్థలానికి చెందిన బోర్డులను తొలగించేందుకు ప్రయత్నించిన వెంకట్రావు, సోమేశ్వరరావు, అన్నాబత్తుల వినోద్, కుత్తుమ లక్ష్మణ్‌కుమార్‌లపై పలాస పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం కోర్టు ఆర్డర్‌ను ధిక్కరించి స్థానిక అధికార పార్టీ నాయకుల అండతో వెంకటరావు, సోమేశ్వరరావు ప్రోద్బలంతో అన్నాబత్తుల రవి, కుత్తుమ లక్ష్మణ్‌కుమార్‌లు ఈనెల ఐదో తేదీన జేసీబీలతో దౌర్జన్యంగా తమకు చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు, పెన్సింగ్‌లను తొలగించి దాని స్వరూపాన్ని మార్చేందుకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అడగడానికి వెళ్లిన తమను హతమారుస్తామని భయపెట్టారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్టు ప్రేమ్ కుమార్ చెప్పారు.

నౌపడలో మేలుకొలుపు


నౌపడలో మేలుకొలుపు కార్యక్రమంలో యువకులు

సంతబొమ్మాళి: మేలుకో రఘురామ.. మేలుకో శుభనామ అంటూ రోజూ తెల్లవారుజామున మేలుకొలుపుతున్నారు. మండలం నౌపడ గ్రామంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి భోగి వరకు నెలరోజుల పాటు మేలుకొలుపు బృందాలు గ్రామాల్లోని వీధుల్లో తిరుగుతూ నగర సంకీర్తన చేస్తున్నారు. మేలుకొలుపు పాటలతో నిద్రలేచి తమ దైనందిక పనుల్లో గ్రామస్తులు నిమగ్నం అవుతారు. నెలరోజుల పాటు సేకరించిన డబ్బులను, బియ్యాన్ని సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజులల్లో వచ్చే యాచకులకు, సంక్రాంతి చుట్టాలకు అందజేశారు. పూర్వం నుంచి వస్తున్న సంప్రదాయాలను నౌపడ గ్రామానికి చెందిన యువకులు కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, మల్లేశ్వర భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ శిఖరం 'మార్పు'


బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి: మాజీ ఎమ్మెల్సీ మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం కృషి చేసి ఉద్యమ శిఖరంగా గుర్తింపు తెచ్చుకున్నారని ఏపీటీఎఫ్ (1938) సంఘం సభ్యులు అన్నారు. బాలకృష్ణమ్మ 12వ వర్ధంతిని కవిటి ప్రాథమిక పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి సంఘనేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

రాష్ట్రస్థాయి అడ్వకేట్ అసోసియేషన్‌లో స్థానం


మనూయాదవ్

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట గ్రామానికి చెందిన న్యాయవాది గూడ మనూయాదవ్‌కు రాష్ట్రస్థాయి అడ్వకేట్ అసోసియేషన్‌లో స్థానం దక్కింది. నవ భారత్ యంగ్ అడ్వకేట్స్ (ఎన్‌వైఏవైఏ), యంగ్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో రాష్ట్ర సభ్యునిగా స్థానం దక్కిందని సోమవారం తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: మందస మండలం కొత్తపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పైల కీర్తన, నెయ్యిల భార్గవి, కోమటి జ్ఞానేశ్వరి, లాగూర్, గౌతమ్, కోమటి శ్రీజల జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో తృతీయస్థానంలో నిలిచారు. వారిని సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం గవ్వ భీమారావు ఆధ్వర్యంలో పతకాలతో అభినందించారు.

ఫుట్‌పాత్ వ్యాపారానికి అవకాశం ఇవ్వండి



ధర్నా చేస్తున్న తోపుడు బళ్ల వ్యాపారులు

టెక్కలి: సంక్రాంతి వరకు ఫుట్‌పాత్ వ్యాపారానికి అవకాశం ఇవ్వాలని పట్టణంలోని తోపుడు బళ్ల వ్యాపారులు కోరారు. ఈ మేరకు సోమవారం టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్న తోపుడు బళ్లను చిన్నబజారు లోపలకు అధికారులు తరలించారు. దీంతో వారందరికీ వ్యాపారాలు లేకపోవడంతో పలుమార్లు నిరసన కార్యక్రమాలకు దిగారు. ఈ క్రమంలో సంక్రాంతి వరకు తమకు అవకాశం ఇవ్వాలని విన్నవిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ నాయకుడు ఎన్.షణ్ముఖరావు మాట్లాడుతూ.. తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న వారిని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలతో ఫుట్‌పాత్‌పై తొలగించడంతో వారంతా వ్యాపారాలు లేక అవస్థలు పడుతున్నారు. కనీసం సంక్రాంతి వరకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. సంఘ ప్రతినిధులు యు.మాధవరావు, వై.చిన్నమ్మడు, ఎల్.తిరుపతిరావు, నాగు, ఎల్.వరదరాజులు, జి.మిన్నారావు, ఉపేంద్ర, సింహాచలం, శ్రీనివాసరావు, డి.రజని, పి.రాము పాల్గొన్నారు.

ఎస్సీ-డీలో కొనసాగించాలని విజ్ఞప్తి


వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: ఆదిఆంధ్రా కులానికి ఎస్సీ-డీ ఉపకులం ఉన్నప్పటికీ తమకు మాత్రం ఎస్సీ-సీగా సర్టిఫికెట్లు అందజేస్తున్నారని దీనిపై అధికారులు స్పందించి తమను ఎస్సీ-డీగా కొనసాగించాలని కోటబొమ్మాళి మండలం చౌదరి కొత్తూరు గ్రామానికి చెందిన ఆదిఆంధ్రా కులస్థులు కె.లక్ష్మణరావు తదితరులు కోరారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. ఇదే విషయాన్ని ఇటీవల ఎస్సీ కమిషన్‌కు సైతం విన్నవించామన్నారు. అలాగే టెక్కలి మండలం భగవాన్‌పురంలోని రైస్ మిల్లుతో ఇబ్బందులు పడుతున్నామని దీనిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఎం.సింహాచలంతో పాటు మరికొంతమంది ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చెప్పారు.

నాలుగు బస్సులు ప్రారంభం


బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ డిపోలో నాలుగు బస్సులను ఎమ్మెల్యే గౌతు శిరీష సోమవారం ప్రారంభించారు. వీటిలో ఇచ్ఛాపురం నుంచి పలాస మీదుగా నడిచే సూపర్‌లగ్జరీ ఒకటి, ఎక్స్‌ప్రెస్ బస్సులు మూడు ఉన్నాయి. పలాస డిపో నుంచి కాశీబుగ్గ వరకు ఎమ్మెల్యే ప్రయాణించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సీతారామ నాయుడు, అసిస్టెంట్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఏపీ ట్రేడ్ చైర్మన్ వజ్జ బాబూరావు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు దిలిప్‌కుమార్, ప్రెసిడెంట్ ఎంఎ రాజు, ఎన్ఎంయూ కార్యదర్శి ఏవీ రావు, ప్రెసిడెంట్ హెచ్‌వై మూర్తి, నాయకులు దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్ తదితరులున్నారు. కాగా పలాస డిపో పరిధిలో బస్సులు కుదించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. దీనిపై సాక్షిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి.



జీడి కార్మికుల వినతి

జీడి పరిశ్రమలలో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పలాస తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తికి సోమవారం వినతిపత్రం అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు శిష్టు గోపి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సుమారు 250 జీడి పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు ఎటువంటి గుర్తింపు లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, సంఘం ప్రధాన కార్యదర్శి అంబటి ఆనందరావు, కార్యవర్గ సభ్యులు గజ్జి బాలయ్య, పి ప్రకాష్ పాల్గొన్నారు. –కాశీబుగ్గ



ఆడపిల్లలను చదవనిద్దాం..

ఆడ పిల్లలను రక్షిద్దాం.. ఆడ పిల్లల్ని చదవనిద్దాం అని వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి కె.ప్రసన్నరాణి అన్నారు. టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆడ పిల్లల రక్షణ చట్టాలు, వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వరకట్న వేధింపులు, అక్రమ రవాణా తదితర చర్యలకు ఎదుర్కొనే విధంగా చైతన్యవంతం కావాలని కోరారు. అత్యవసర సమయాల్లో 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నంబర్ల సాయం తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం ఎం.అనురాధ, మహిళా పోలీస్ ప్రమీళ, ఉపాధ్యాయులు కె.నారాయణరావు, పి.ఋషి, పి.చిన్నారావు ఉన్నారు. –టెక్కలి



ఆకస్మిక తనిఖీ..

సంతబొమ్మాళి మండలం నౌపడ, సంతబొమ్మాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను టెక్కలి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మేరీ కేథరిన్ సోమవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, పీహెచ్‌సీ స్థాయిలో అమలు చేస్తున్న వివిధ అరోగ్య కార్యక్రమాలు తీరును పరిశీలించారు. ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్)ను వైద్య సిబ్బంది అందరూ నిర్దేశించిన సమయానికి వేయాలని ఆదేశించారు. నిల్వ ఉంచిన వ్యాక్సిన్ల ఉష్ణోగ్రత (వ్యాక్సిన్ వైల్ మానిటర్ల)ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని వైద్యాధికారులకు సూచించారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.–సంతబొమ్మాళి



పారిశుద్ధ్య పనులు

మండల కేంద్రం కవిటి పంచాయతీ ప్రగడపుట్టుగలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయతీ విస్తరణాధికారి జి.వీరభద్ర స్వామి పర్యవేక్షణలో ప్రగడపుట్టుగ గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను జేసీబీతో తొలగించి కవిటికొత్తూరు సమీపంలోని చెత్తతో సంపద కేంద్రానికి తరలించారు. –కవిటి